("జ్యోతి" మాసపత్రిక-నవంబరు 1978)

ఇప్పించే కథ

ఏర్ కండిషన్డ్ రూము తలుపు తెరుచుకొంది. తలుపు తెరిచి వోరగా నించున్న ఒరియా నౌకరు మహాపాత్రో వినయంగా సలాం చేస్తూ "ఎమ్. డి. గారు డైచేమన్నారు సార్ తమర్ని" అన్నాడు.

"సరి! ఎంత సేపయింది?"

"ఐదునిముషాలయింది సర్."

"ఫోన్ చేశారా?"

"లేద్సార్. వారే స్వయంగా మన రూం దగ్గరకొచ్చి పిలిచారు సర్."

"ఐసీ——"

కుర్చీదాకా వెళ్ళికూడా అందులో కూర్చోకుండా దాన్నోసారి గిర్రున తిప్పాను. నా మనసులో ఆలోచన్లుకూడా గిర్రున తిరగడానికి ప్రయత్నం చేసేయి, ఎమ్. డి. గార్నోసారి తలవగానే. "పేకిట్ ఈజీ బాస్" అన్న ధోరణిలో నలభయి రెండు మెట్లూ దిగి రెండో అంతస్తులోవున్న ఎమ్. డి.గారి గది దగ్గిరకి వెళ్ళాను.

ఎమ్. డి. గారి రూం తలుపుకి మీదుగా ఆయన ఖాళీగా వున్నారని తెలిపే పసుపు పచ్చదీపం వెలుగుతోంది. దర్వాను రెండుచేతులా నమస్కారం చేసి తలుపు తెరిచి పట్టుకున్నాడు.

"గుడ్మార్నింగ్ సర్" అంటూ లోపల ప్రవేశించాను.

మేనేజింగ్ డైరెక్టరుగారు తన సీటులో లేరు. రిలాక్సింగ్ సోఫాసెట్లో ఇద్దరికీ సరిపడే సోఫాలో కూర్చుని వున్నారు. సింగిల్ చేర్, ఎదురుగా టీపాయ్ ఖాళీగా వున్నాయి.

"గుడ్మాణింగ్. హౌ ఆర్యూ మిస్టర్ కృష్ణయ్యా?"

"ఫైన్ సర్-" అని చేయిచాపాను,

"ఐనో. ఐనో! అని చిరునవ్వుతో నా చెయ్యి ఆడించి ప్లీజ్ బి సీటెడ్" అన్నారు.

"థాంక్యూ సర్," అంటూ కూర్చున్నాను.

మేనేజింగు డైరెక్టరుగారు కాలితో బెల్ నొక్కారు. జపనీస్ క్రైమ్స్ ఇంప్రెన చప్పుడుతో మోగాయి. మరుక్షణం దర్వాను తలుపు ఓరగా తెరచి విన యంగా వంగాడు.

"ఎవర్నీ పంపొద్దు. టెన్ మినిట్స్" అని కరుగ్గా చెప్పారు ఎం. డి.

"ఎస్సార్"

తలుపు మూసుకుంది.తలుపుకు పైన అవతలకీ ఇవతలకీ కనపడే యెర్ర దీపం అందంగా వెలిగింది. అది అలా వెలిగినంతకాలం ఆ గదిలోకెవరూ అడుగు పెట్టడానికి వీల్లేదు.

ఎం. డి. గారు సోఫాలో దిండు సరి చేసుకుని విశ్రాంతి తీసుకునే భంగి మలో కాళ్ళుజాపి కూర్చున్నారు.

సిగరెట్టు పెట్టెతీసి ఆయనొకటి వెలిగించి పెట్టె, లైటరు అందించారు నాకు.

ఒళ్ళంతా మెలికలు తిప్పుకుంటూ "థాంక్యు సర్" అన్నాను: సిగరెట్టు పెట్టెను సుతారంగా దూరంగా తోస్తూ.

"తీసుకోండి. మీరు కాలుస్తారని నాకు తెలుసు!" అన్నారు ఎం. డి.

బాగుండదని తీసుకున్నాను. దర్జా ఐన ఫారిన్ సిగరెట్టు రెండుదమ్ములు పీల్చి భయంగా చూస్తున్నట్టు నటించాను. "స్వయంగా నా రూంకొచ్చి పిలిచా రట సార్" అన్నాను.

"మీరు సదుపాయంగా కూర్చోండి" అన్నారు ఎం. డి.

"నోసర్! నాకిలా బావుంది!" అన్నాను కుర్చీలో యిబ్బందిగా కదిలి.

"మీతో నేను పదినిమిషాలు గడపాలి. మీరు సౌఖ్యంగా కూర్చోడం నా అభిమతం!" అని. టీపాయిని చేత్తో నాకాళ్ళ దగ్గరకు తోశారు. "మీరు దానిమీద కాళ్ళు పెట్టుకుని హాయిగా కూర్చుంటే, నేను ఇలాంటి మర్యాదలమీద టైంవేస్టు చెయ్యకుండా మాట్లాడగలను!" అన్నారు ఎమ్.డి. కఠినంగా.

తప్పిందిగాదు.

కుర్చీలో వెనక్కి వారగిలి, కాళ్ళు రెండూ టీపాయ్‌మీద రెస్టుచేసి, మా యింటిలోనో, ఆఫీసులో నా రూమ్‌లోనో కూర్చున్నట్టు కూర్చున్నాను. కింగు సైజు ఫారిన్ సిగరెట్టు ఇంకా ముప్పాతిక భాగం వుంది.

* * *

"నేనిక్కడికి ఎం. డీ. గా వచ్చి రెండేళ్ళయింది!"

"ఎస్సార్."

"ఈ రెండేళ్ళలో మిమ్మల్ని స్వయంగా కలవడం-ఇవ్వాళ్టి సమావేశంతో-పంధొమ్మిదిమాట్లు."

"సారీ సార్, వర్క్ యెక్కువగా వుంటోంది. కాగితాలు పంపిస్తే తమరు ఆర్డర్సు వేస్తూనేవున్నారు. స్వయంగావచ్చి మిమ్మల్ని డిస్టర్బ్ చేయడమెందు కని-అవసరం వుంటేతప్ప తమర్ని బాధపెట్టడం లేదు" అన్నాను.

"మంచిదే. కాని కాగితాలు చూసినంత మాత్రంచేత బోధపడనివి ఏవి వున్నా నేను కూడా మిమ్మల్ని శ్రమ పెట్టకుండా మీ డిప్యూటీతో మాట్లాడి సెటిల్ చేస్తున్నాను.

"యస్సార్. ఆయన నాతో అప్పుడప్పుడు చెప్తారు. బాస్ పిలిచారు; ఫలానా విషయం గురించి అడిగారు. ఆర్డర్సు వేసారు అంటూనూ. ఆర్డర్సు పడ్డాయవి రిలీఫ్‌గా వున్నప్పటికీ తమరు నన్నేపిల్చి అడగలేదేమా అని అప్పుడప్పుడు ఖేదం కలుగుతూనే వుంటుంది నాకు" అన్నాను.

ఎం. డీ. గారు అందంగా నవ్వారు. "మీ డిపార్టుమెంటులో ఏదేనా ఫైలు కాగితంద్వారా నాకు వివరం ఆమూలాగ్రంగా అందించలేకపోతే నేను ముందుగా పిలిచేది మిమ్మల్నే. కాని మీరు దొరక్క కాగితం సెటిలవకుండా నా దగ్గరుండి పోవడం నాకు యిష్టం వుండక, మీ డెప్యూటీ చెప్పిన దానిమీద ఆధారపడాల్సి వస్తూంది!—ఆ సంగతి మీకెప్పుడూ తట్టలేదా!"

కాళ్ళు టీపాయ్ మీదినుంచి తీసేశాను.

ఈ డెప్యూటీగాడు ఇంతపని చేస్తాడా అని నాకు కసి కలిగింది. నిమ్మకు నీరెత్తినట్లు నిశ్చింతగా మాటల్తో గోతులు తవ్వుతున్న ఎం. డి.ని చూసి భయం వేసింది కూడా.

"లేదుసార్. అలా నేనెప్పుడూ అనుకోలేదు. బైదిబై, నేను దొరకలేద న్నారా సార్?" అన్నాను: చిన్న ఆధారం ఏదైనా దొరక్కపోతుందా, దబాయించలేక పోతానా అని.

"కంగారుపడకండి కృష్ణయ్యగారూ. సరిగ్గా కూర్చోండి" అని ఆయన లేచి మళ్ళా నేను యిందాకటిలా కాళ్ళు జాపి కూర్చునేవరకు ఆ మర్యాదల్లో కాలం గడిపాడు. "ఈజీగా కూర్చోండి. మీరు బిగిసిపోయి కూర్చోవలసిన అవసరం లేదు. ఇక్కడ మీకెవ్వరూ ఫోటో తియ్యరు! అన్నారు మధ్యలో.

"విషయం ఏమిటంటే, మిమ్మల్ని చూడాలనుంటే నాకు ఒకటే మార్గం. నా పి.ఏ.తో చెప్పడం. మిగురించి నేను ఈ రెండేళ్ళలో నూటతొమ్మిదిసార్లు నా పి.ఏ. ద్వారా కబురు చేశాను. అందులో ఏడుసార్లే మీరు నాకు దొరికారు. మిగిలిన నూటరెండు సార్లుకూడా, దురదృష్టవశాత్తు మీరు లేరనే తెలిసింది."

మళ్ళా కాళ్ళు టీపాయ్‌మీంచి తీశాను.

ఎం.డి. తనుకూడా బిర్రబిగిసి కూర్చున్నారు. "లేనిపోని లాంఛనా లెందుకు కృష్ణయ్యగారూ మీరు యింటిలోగానీ, ఆఫీసులో మీ రూంలోగాని, చివరికి ఏదేనా ఉద్యోగానికి అభ్యర్థులను ఇంటర్‌వ్యూ చేసేటప్పుడుగాని కాళ్ళు రెండూ టేబిల్‌మీదే పెడతారుగదా. అలా కూర్చుని ఫ్రీగా మాట్లాడండీ-అంటే ఎందుకు గడికోసారి కాళ్ళు తీసేడం, బిర్ర బిగిసిపోవడం ఈ అర్థంలేని లాంఛనాలు?"

పళ్ళు పటపట కొరుక్కున్నాను. ఎవడో కాకారాయుడు చెప్పులు కొరికితే మాత్రం; అవన్నీ విని లెక్కకి తీసుకోడమేమిటి ఈయన?

"మీరు ప్రతిరోజు ఆఫీసుకు పదిగంటలకు రావాలి. పావుతక్కువ పదకొండుకు వస్తారు. ఒంటిగంటకు లంచ్‌బోర్డుపెట్టి మూడుగంటలకు తీస్తారు ఐదుగంటలకు వెళ్ళిపోవచ్చు. కాని నాలుగింటికే వెళ్ళిపోతారు. మొత్తం మీకిచ్చే మూడువేల రూపాయల జీతానికి మీరు పనిచేసేది రోజుకు మూడే గంటలు!"

మీరనేది నిజంగాదని నా అనుమానం" అన్నాను. ఆయన మాట్లాడుతూ ఆగకపోతే అదీ అనలేనేమో అనిపించింది.

"మీకనుమానం- కాని నాకు నమ్మకమే!" అని కళ్ళు రెండూ మూసుకున్నారు ఎం.డి.

తన పెద్ద టేబిలువైపు చూపించి "మీరేమీ అనుకోకపోతే" అన్నారు.

నేను లేచి నిలబడ్డాను, యాంత్రికంగా.

"నా టేబిలు మీద ఎర్ర పేపరు వెయిటు కింద పైవుచేసిన కాగితాలున్నాయి...."

వెళ్ళి తెచ్చాను.

ఆయన కళ్ళు తెరవకండానే అన్నారు.

"ఆ కాగితాల్లో అంకెలు చూడండి. అవన్నీ మీరు, ఆఫీసునించి, ఆఫీస్

టైమ్‌లో ఆపరేటరు సహాయంతో మాట్లాడిన టెలిఫోన్ నెంబర్లు, ఆఫీసు పని చేసిన రోజుల సంఖ్య చేత ఆ లిస్టులో వున్న టెలిఫోన్ నెంబర్ల సంఖ్యను భాగిస్తే రోజుకు సరాసరిని నలభై రెండు కాల్సుపడ్డాయి. ఈ టెలిఫోన్‌కాల్స్ నిమిత్తం కంపెనీ చెల్లించవలసిన సొమ్ము గురించి కాదు, నా బెంగ. కంపెనీలో వొక ముఖ్య అధికారిగా రోజుకు మూడే మూడు గంటలు ఆఫీసులో కూర్చుంటూ, నలభై రెండు మూళ్ళు నూటఇరవయ్యారు నిమిషాలు మీరు టెలిఫోన్లో మాట్లాడుతూనే గడిపితే. ఇంక మీరు పనిచేసినదెంతా అని నా సదసత్సంశయం!"

ఒక లిప్తపాటు కళ్ళు తెరిచి నావేపు చూసి, వెంటనే కళ్ళుమూసి తల పైకెత్తారు ఎం.డి.

నేను గుటకలు మింగేసు. "సార్...." అన్నాను.

"ఒక్క మనవి" అందామని ప్రయత్నం.

ఎమ్.డి, గారు చెయ్యడ్డం పెట్టారు. కళ్ళు మూసుకునే మాట్లాడారు.

"నాకొచ్చిన సమాచారం, దానికి ఆధారం—వీటి విషయం లోతుకు వెళ్ళొద్దనీ, అక్కర్లేదనీ నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. సమాచారం సేకరించడంలో నాకొక శిక్షణ వుంది....నేను మీ కంపెనీలోకి ఎమ్.డి.గా రాక పూర్వం అనేక వుద్యోగాలు చేశాను. అందులో దినపత్రిక విలేఖరి పని ఒకటి. అప్పుడు నాకు చాలా చిన్నవయసు. ఓసారి నేనేదో వార్త పంపిస్తే దాన్ని పత్రికలో వెయ్యాలా అక్కర్లేదా అని సందేహం వచ్చి మా ఛీఫ్ ఎడిటర్ నాకు కబురు చేశారు. నేను వెళ్ళాను. ఈ వార్త నిజమేనా అన్నారు. "నిజం కాకపోతే నేను పంపనని మీకు తెలుసుకదా" అన్నాను. "నీమీద నమ్మకం లేక కాదు; ఈ వార్త నీకెలాగొచ్చింది, తెలుసుకోవాలనుంది అన్నారు. "పత్రికా విలేకరులు వార్తలు అందిస్తారుగాని వాటినితామెలా సంపాదించారో చెప్పరండి" అన్నాను. "ఇలాంటి వార్తలు ప్రచురిస్తే దెబ్బలాట లొస్తాయేమో" అన్నారు. "వెయ్యటమో మానడమో మీరు చూసుకోండి: దెబ్బలాటొస్తేనేను చూసుకుంటాను అన్నాను—ఇదంతా నేనెందుకు చెబుతున్నానంటే,-ఒక పద్ధతిగా సమాచారం సేకరించడం, అలా సేకరిస్తున్నట్లు యెవ్వరికీ తెలీకండా జాగ్రత్త పడ్డం నాకు బాగా తెలుసు; అందుచేతనే ఇదంతా ఎవరో కాకారాయుడు చెవులు కొరగ్గా చాడీలు చెప్పగా దొరికిన సమాచారమేమోనని నేను అనుమానించడం లేదు!"

నేను మళ్ళా గుటకలు మింగేసు.

జేబులోంచి వొక కాగితం తీశారు ఎం. డి.గారు. "ఇది మీ కేమయినా పని కొస్తుందేమో చూడండి" అని నాకు అందించారు.

అది ఒక దినపత్రికలో ప్రచురించిన ప్రకటన.

ప్రభుత్వరంగంలో ఒక పెద్ద సంస్థనడుపుతున్న ఒక రిసెర్చి యూనిట్‌లో సూపరింటెండెంటు కావాలిట. అర్హతలన్నీ నాకున్నాయి. జీతం కూడా ఇప్పుడు నాకు వస్తున్నంత వస్తుంది. ఓ విధంగా చూస్తె ఆ ప్రకటన నన్నే వెతుకుతూ వేశారేమో అనిపించింది. ఐతే, ఉద్యోగం మరీ తాత్కాలికం. ఒక యేడాది మాత్రమే.

లోకాగితం మడిచి జేబు వుంచాను.

"రైట్! మీరు వెళ్ళచ్చు. సారీ! మిమ్మల్ని బాధ పెట్టానేమో." అని ఆయన షేక్హాండిచ్చారు. సిగరెట్టు పెట్టి తీసి తానొకటి వెలిగించుకున్నారు, నాకొకటి ఇవ్వలేదు.

* * *

ఫొటోలు తీశారు. దండలు వేసేరు. సన్మానపత్రాలు చదివారు. ఒక శ్రీద్దరు ఫొటోలకు సన్మానపత్రాలకు అద్దాలు కట్టించి యిచ్చారు. ఆఖరు రోజున సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు, కళాకారులకు మా శ్రీమతి చేత మెమెంటోల బహూకృతి: మా ఇద్దర్నీ కళాకారులతో చేర్చి గ్రూఫ్‌ఫొటో,.... గొప్ప వేడుక జరిగింది, వారంరోజులు డిన్నర్లతో పార్టీలతో వూపిరి సలపలేదు.

రేపు బయల్దేరుతున్నాం, కొత్త వుద్యోగం వచ్చిన వూరికి, ఇక్కడికి పన్నెండు వందలయామైళ్ళ మైళ్ళుంది. అయినా ఉద్యోగికి దూర భూమి లేదన్నారు కదా.

"బీచికి వెళదాం!" అన్నానుశ్రీమతితో,

"ఇప్పుడా?" అన్నది భాగ్యలక్ష్మి.

"ఎంతో చీకటవ లేదు, అరగంటలో వచ్చేద్దాం" అన్నాను.

విడిగా ఓ చోట కూచున్నాం. నలభై ఐదేళ్ళు నాకూ. ముప్పయ్యయిదేళ్ళు ఆవిడికీ దాటినా కుర్రజంటలా కనిపిస్తునట్లున్నాం. పక్కనించి నడిచేవాళ్ళు లవర్సేమోనని అనుమానంగా చూస్తూ వెళుతున్నారు. అయినా మాకేం యిబ్బందవలేదు, మేం లవర్స్ కాకపోతేగా!

తేలికయిన చెక్కతో చేసిన జంగిడి ఓ చేత్తోనూ మోడా ఓ చేత్తోను

పట్టుకసి పిడతకింద పప్పువాడు వచ్చాడు. జంగిడీలో ఓ పక్కని కొవ్వుతో సహా కొవ్వొత్తంతలావున్న ఒత్తితో దీపం సముద్రపొద్దు గాలిని ప్రతి ఘటించి వెలుగుతోంది. నడివయస్కుడి ఉద్యోగ ప్రయత్నంలాగ.

మమ్మల్ని చూసి మోడా ఇసకలో గుచ్చి జంగిడి పెట్టాడు.

"ఐగారు మసాలా మిచ్చర్" అన్నాడు.

"సర్లేగాని ఇల్రా" అన్నాను.

ఒచ్చేడు.

"ఇలా పప్పు అమ్ముకోడమేనా. లేక వేరే ఏదన్నా పనిచేస్తూ వుంటా వోయ్ నువ్వు?" అన్నాను.

"అదంతా మీకెందుకండి. తింటే వాడు తెచ్చింది తిన్రాదా లేకపోతే పొమ్మన్రాదా" అన్నది భాగ్యలక్ష్మి.

"అడగనీండమ్మా అడిగితేటి పోనాది?" అంటూ మాటగ్గిరచను పుంపాది స్తున్నాడు వాడు, "మంచీపెద్దా తెల్సిన బాబులయితే! బోగట్టాలడుగుతా రంతే" అని వొక రిమార్కు పారేసి "....కంపెనీలో శిఫ్టుడూటీ మీద వస్చేత్తానండి నాలుగొందలిత్తారు....! ఈ యేలప్పుడు డూటీ నేకపోతే సర్దాగా సంద్రపుగాలికి జంగిడొట్టు కొత్తానండి"

మా కంపెనీలోనే పని చేస్తున్నాడన్న మాట!

ఇంకా మా కంపెనీ యేమిటి!?

అయితే మా కంపెనీలో నన్ను గుర్తుపట్టనివాళ్ళు కూడా కొందరు వున్నా రన్న మాట!

"మీ పెరసనల్ మేనేజరు క్రిష్ణయ్య గారు బావున్నాట్టోయ్?" అన్నాను.

"ఇంకేటి బాగు బాబు! ఆ బాబు జండా దిగిపోనాది."

"జండా దిగిపోడమేమిటి? మంచాడు గాడా?"

"మంచంతే అదీ వొక మంచేనండి."

"అంటే యెలాంటి మంచి చెబుదూ."

"ఎలాటి మంచేటి బాబూ. ఒవుడెలా గున్నాటో. ఒవుడెలా పోతన్నాడో ఆ బాబు కేటీ అక్కర్నెద్దండి. మంచంటే మరదీ వొక మంచేగాదా?"

"అంత మంచా?" అన్నాను. చాటుగా భాగ్యలక్ష్మి వీపుమీద గిల్లి. "నా కీర్తి చూడు. చుక్కలవలె కర్పూరపు ముక్కలవలె" అన్నట్లు మొహం పెట్టి,

"ఆ బాబు పని జోలికెళ్ళడు. ఉంకోలు పన్జేత్తన్నారా లేదా అని సూడ్డు. మరి తప్పుఁడు అడిగారు గాబట్టి అదీ వోరకం మంచేనండి!"

"ఊఁ అలాగా?"

"అయితే అంతమంచిని ఎన్నాల్లు సాగనిత్తారు బాబూ. ఆ బాబుమీద పెద బాబు నిగా ఏస్సినాడు."

"ఏమి నిఘావోయ్! క్రిష్ణయ్యగారే పేద్ద అఫీసరుగదా.అయన్ని ఎమ్.డీ. గారు మాత్రం ఏం చైగల్రు!" అన్నాను ప్రగల్భంగా!

"ఓర్ని ఓరూ ఏటీ సెయ్యనేరు బాబూ. అయితే కిష్టయ్య బాబు ఇక్కడుండకంటా సేసీసినాడు గాదా, ఎమ్.డీ.బాబు! సాల్దా?"

"అదెలాగ? ఆయనెవడయ్యా ఇతన్నిక్కడుండకండా చేసీడానికి? ఇతనికే ఇంకోచోట మంచి ఉద్యోగం వొస్తే పోతున్నాడేమో?"

"పెద్దోళ్ళ బాబూ. అళ్ళ వూసులు మాకేటి తెలుస్తాయి? పక్కోడు కులాసగుంటే సూళ్ళేని రోజులు! దాంతో ఇందిరమ్మగారు యమర్జెన్సీ ఓటి ఎట్టేసినారు గదా."

"అయితే ఏం చేసేడంటావు. మీ ఎం. డీ. బాబు?"

"ఏత్నేదు బాబూ. ఓ రోజు మామూలుగా ఆఫీసు కెల్లాడట మా పి.ఎం. బాబు. ఎమ్.డీ. బాబేమో, ఈ బాబుని పిలమన్సెప్పి, కూకోబెట్టి "ఏటయ్యా కిష్టయ్యబాబూ, ఇక్కణ్ణుండీ తప్పుకుంతావా బొక్కసింపే మంతావా అని అడిగినాడు. నేదుబాబూ నానే తప్పుకుంతానం చెప్పి ఈ బాబుంకో వుద్దోగం సూసుకో నెలిపోతన్నాడు."

"బలేగా మాట్లాడతావోయ్ నువ్వు!" అన్నాను; ఆరిపోయి.

"ఐగారు, మసాలా మిచ్చరు తిన్రా?" అన్నాడు వాడు; పాయింట్‌లో కొచ్చి.

హైబ్రో డిన్నర్లతో విసిగిపోతున్న నా ప్రాణానికి మసాలా మిక్శ్చరు నిజంగా తినాలనే అనిపించింది.

"ఇక్కణ్నుండీ తప్కుంతావా. బొక్కింపీమంతావా" అన్నాట్ట ఎమ్. డి. బాగా చెప్పాడు; చూసి, వినీసిన వాళ్ళాగ. జరిగిందాన్నే వాడి భాషలో చెప్పాడు.

* * *